



తల్లులపై ప్రేమేదీ?

చింతలగట్టు సమ్మక్క-సారలమ్మ జాతరపై వివక్ష

- దాతలిచ్చే విరాళాలతోనే ఉత్సవాల నిర్వహణ
- మినీ మేడారంగా ఖ్యాతి పొందినా వసతుల కల్పనలో నిర్లక్ష్యం
- మేడారం తరహా సంప్రదాయాలతో పూజలు
- సుమారు 3లక్షల మందికిపైగా భక్తుల రాక
- అయినా దేవాదాయశాఖ జాబితాలో దక్కని చోటు
- నేటి నుంచి 15 వరకు మొక్కులు


భక్తులు స్నానాలు ఆచరించే వట్టివాగు ఇదే

గూడూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అతిపెద్ద గిరిజన, ఆదివాసీ జాతర వివక్షకు గురవుతోంది. మినీ మేడారంగా అనతి కాలంలోనే ఖ్యాతిగడించిన చింతలగట్టు వట్టివాగు.. సమ్మక్క-సారలమ్మ జాతర అభివృద్ధికి నోచుకోవడం లేదు. సుమారు 3 లక్షల మంది భక్తులు వస్తున్నప్పటికీ కనీస వసతుల కల్పనలో దేవాదాయశాఖ నిర్లక్ష్యం చేస్తోంది. దీంతో గూడూరు మండలంలోని చింతలగట్టు వట్టివాగు సమ్మక్క-సారలమ్మల జాతర కొన్నేళ్లుగా భక్తులు అంద జేసిన విరాళాలతో అరకొర సౌకర్యాల మధ్య సాగింది. ఈ సారి అదే పరిస్థితి.. జాతరలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. స్నానాలు చేయడానికి నీరు లేని పరిస్థితి. గూడూరు మండలంలో చింతలగట్టు వట్టివాగు సమ్మక్క-సారలమ్మ జాతర 12సంవత్సరాలుగా అత్యంత వైభవంగా భక్తుల రాకతో విరజిల్లుతోంది.. అనతి కాలంలోనే ఈ జాతర భక్తుల విశ్వాసం పొంది.. మినీ మేడారంగా ఖ్యాతి గడించింది. మచ్చర్ల-దామరవంచ-జగన్నాయకులగూడెం సరిహద్దు అటవీ ప్రాంతంలో జరిగే ఈ జాతరతో నాలుగు రోజులు సందడిగా ఉంటుంది. ఆ నాలుగు రోజులు చింతలగట్టు వట్టివాగు సమ్మక్క-సారలమ్మ జాతర ప్రాంగణం కనుచూపు మేర భక్త జన వసమై భాసిల్లుతుంది. జన పూనకాలతో వనస్థలిని ఊపేస్తాయి. సుమారు 3 లక్షల మంది భక్తులు ఆ తల్లుల చెంతలకు చేరుకొని మొక్కులు సమర్పిస్తారు. గూడెపు సంప్రదాయాన్ని, ఆదివాసీ ఆచారాల్ని ప్రపంచానికి చాటుతాయి. అత్యంత గోప్యంగా నిర్వహించే ఆదివాసీ పూజ విధానం, ఆ నాలుగు రోజుల పాటు చింతలగట్టు మేడారంలో జరిగే తీరూ అద్యంతం ఆసక్తికరం.

జాతర జరిగే సమయంలో..

అటవీ ప్రాంతంలో ఉండడంతో జాతరలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులకు గురవైతున్నారు. కనీసం తాగునీరుతో పాటు స్నానాలు ఆచరించడానికి నీటివసతి కరువుగా మారింది. జాతరలో ప్రభుత్వం కనీస సౌకర్యాలు కల్పించక పోవడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాతర అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, అధికారులు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడం లేదు. పాలకుల మాటలు నీటిమూటలుగా మారాయి. గత జాతరలో పాలకులు ఇచ్చిన హామీలు అతీగతీ లేకుండా పోయాయని భక్తులు మండిపడుతున్నారు. నిర్వహణకు ప్రతీసారి జాతర అభివృద్ధి కమిటీ సేకరించే విరాళాలతో అరకొర సౌకర్యాల నడుమ జాతరను నిర్వహిస్తూ వస్తున్నారు. విద్యుత్ సౌకర్యం కూడా లేకపోవడంతో జనరేటర్ సాయంతో వెలుగులు ఏర్పాటు చేస్తున్నారు. తాగునీరు కూడా జాతర అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేస్తుంది. మూడు లక్షలకు పైగా భక్తులు వచ్చే జాతరను దేవాదాయ శాఖ

మిగతా 8వ పేజీలో...

ఆదివాసీ సంప్రదాయ పూజలు..

చింతలగట్టు.. వట్టివాగు సమ్మక్క-సారలమ్మ జాతరలో మేడారంలో జరిగే సమ్మక్క-సారలమ్మల జాతర పూజతంతు మాదిరిగానే ఉంటుంది. విగ్రహ రూపంలేని విధానాలకు పూర్తిగా భిన్నంగా ఉంటుంది. మిగిలిన ఆలయాల్లో మాదిరిగా అక్కడ దేవతలు ఎప్పటికీ ఉండరు. జాతర జరుగుతున్న మూడు రోజులు మాత్రమే దేవతలు అక్కడ ఉంటారు. వన దేవతలకు వన ప్రవేశం చేయిస్తారు. నిజానికి మొక్కులు ఆ రోజుల్లో మాత్రమే చేయలన్నది కోయ దొరల నమ్మకం.

నేటి నుంచి జాతర షురూ..

ఈ ఫిబ్రవరి 12న వనదేవతలకు పసుపు, కుంకుమ మార్చుకొనుట, 13న గుడి మెలుగుట, 14న వనదేవతలకు మొక్కులు చెల్లించుట, 15న జాతర ముగింపు ఉంటుంది. చింతలగట్టు వట్టివాగు సమ్మక్క-సారలమ్మ జాతర ఏర్పా ట్లు జాతర, పూజారుల కమిటీ ఆధ్వర్యంలో పూర్తి చేశారు. అమ్మవార్ల గద్దెల చుట్టు ఫెన్సింగ్, గద్దెల చుట్టు రంగులు వేశారు. జనరేటర్ సాయంతో విద్యుత్ సౌకర్యం కల్పించారు. స్నానాలు ఆచరించడానికి వట్టివాగులో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జాతర ప్రాంగణంలో దుకాణ సముదాయాల నిర్వహణ కోసం స్థలాన్ని కేటాయించారు. ఇప్పటికే పోలీస్, వివిధ శాఖల అధికారులు సందర్శించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు.


గూడూరు మండలం చింతలగట్టు వట్టివాగు సమ్మక్క-సారలమ్మ జాతరలో జనసంద్రం (ఫైల్)

జాతరలో మౌలిక వసతులు కల్పించాలి

దారం సిద్ధు, పూజారుల కమిటీ అధ్యక్షుడు, దామరవంచ




చింతలగట్టు వట్టివాగు సమ్మక్క, సారలమ్మ జాతరలో ప్రతీ రెండేళ్లకొకసారి మహాజాతర, ఏడాదికొకసారి మినీ జాతర నిర్వహిస్తూ వస్తున్నాం. జాతరకు సుమారు ఏటా లక్షలాది మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకుని, మొక్కులు చెల్లించుకుంటున్నారు. భక్తుల సంఖ్య పెరుగుతుండడంతో ప్రభుత్వం జాతర ప్రాంగణంలో మౌలిక వసతులు కల్పించాలి.

జాతర నిర్వహణకు నిధులివ్వాలి

పెనక నాగయ్య, జాతర కమిటీ అధ్యక్షుడు, జగన్నాయకులగూడెం



చింతలగట్టు.. వట్టివాగు సమ్మక్క, సారలమ్మ జాతరకు ఏటేటా భక్తుల సంఖ్యపెరుగుతూ వస్తోంది. ప్రభుత్వం ఈ జాతరకు గుర్తింపునిచ్చి జాతర నిర్వహణ కోసం దేవాదాయశాఖ ద్వారా నిధులు మంజూరు చేయాలి. భక్తుల సౌకర్యార్థం ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వమే అన్ని ఏర్పాటు చేయాలి.



ఆకస్మికంగా ఖరారు..

ఆ వెంటనే రద్దు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ఓరుగల్లు పర్యటనపై అయోమయం

- మూడు గంటల వ్యవధిలోనే మారిన పరిణామాలు
- ఆర్ట్స్ కాలేజ్ మైదానంలో హెలిప్యాడ్.. మోహరించిన పోలీసులు
- రాహుల్‌గాంధీ రాక కోసం విస్తృత ఏర్పాట్లు చేసిన నేతలు
- బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణపై అభిప్రాయ సేకరణకు కార్యాచరణ
- వరంగల్- చెన్నై రైల్ జర్నీలో రైల్వే ప్రైవేటు సేవలపై ప్రయాణికులతో మాటామంతీకి యోచన
- టూర్ రద్దుతో కాంగ్రెస్ శ్రేణుల డీలా

వరంగల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ వరంగల్ పర్యటన ఆకస్మికంగా ఖరారైంది. కానీ అంతలోనే పలు కారణాలతో రద్దు కూడా అయింది. మంగళవారం సాయంత్రం ఓరుగల్లుకు రాహుల్ రాబోతున్నారంటూ ఉదయం 10.30గంటలకు షెడ్యూల్ ఖరారైంది. దీంతో పార్టీ నేతలు, శ్రేణులు ఏర్పాట్లు చేసేందుకు ఉరుకులు పరుగులు పెట్టారు. కానీ అగ్ర నేత పర్యటన రద్దయ్యిందంటూ మధ్యాహ్నం 1.30గంటలకు ప్రకటన రావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో అయోమయానికి గురయ్యారు. మూడు గంటల వ్యవధిలోనే పరిణామాలు మారిపోవడం వెనుక ఏం జరిగిందనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతోంది.

రాహుల్ షెడ్యూల్ ఇలా..

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మంగళవారం వరంగల్‌కు వస్తున్నట్టుగా ఉదయం 10.30 గంటలకు ప్రకటన రావటం కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్కంఠను రేపింది. ఢిల్లీ నుంచి మధ్యాహ్నం 2.45 గంటలకు విమానంలో బయలుదేరి, సాయంత్రం 5గంటలకు హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుని, అక్కడి నుంచి చాపర్ ద్వారా సాయంత్రం 6గంటలకు వరంగల్‌లోని ఆర్ట్స్‌కాలేజీ మైదానానికి చేరుకునేలా షెడ్యూల్ ఖరారైంది. అయితే టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో వరంగల్‌లో ఎలాంటి బహిరంగ

మిగతా 7వ పేజీలో...


ఎండల నేపథ్యంలో వనదేవతల గద్దెల ప్రాంగణంలో వేసిన చలువ పందిళ్లు

మినీ సంరంభానికి సర్వం సిద్ధం

నేటి నుంచి మేడారం చిన్న జాతర

- మండెమెలుగు పండుగతో ఆరంభం
- వనదేవతల మందిరాలు, గద్దెల వద్ద పూజలు చేయనున్న వడ్డెలు
- నాలుగు రోజుల పాటు తల్లుల చెంతకు రానున్న భక్తజనం

7

'విలేజ'లో ఇంటినెంబర్ల జారీపై ఫిర్యాదు

- ఖాళీ స్థలాలకు నెంబర్లు ఇచ్చారని ఆరోపణ
- కలెక్టర్‌కు మాజీ సర్పంచ్ ఫిర్యాదు

కేసముద్రం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మునిసిపాలిటీ విలీన గ్రామపంచాయతీ కేసముద్రం విలేజిలో ఇంటినెంబర్ల జారీలో అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపిస్తూ.. ఆ గ్రామ మాజీ సర్పంచ్ సట్ల నర్సయ్య మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గతనెల 25న మునిసిపాలిటీ ఏర్పాటుకాగా అంతకు ముందు ఏడాది కాలంగా నిబంధనలను అనుసరించకుండా భవన నిర్మాణ అనుమతులు లేకుండా ఖాళీ స్థలాలకు ఇల్లు నిర్మించుకోకుండానే ఇంటినెంబర్లు జారీ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక్కోవ్యక్తి పేరిట మూడు ఇంటి నెంబర్లు, పాత ఇంటికి బైనెంబరుతో మరోకొత్త ఇంటి నెంబరును ఇష్టారాజ్యంగా జారీ చేశారని ఫిర్యాదులో తెలిపారు. ఈ ఇంటినెంబర్ల జారీకి భారీగా డబ్బులు చేతులు మారినట్లు ఆయన ఆరోపించారు. ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిబంధనలను పక్కన పెట్టి ఇంటి నెంబర్ల జారీకి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్‌ను కోరారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

- ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ హెచ్చరిక
- జిల్లాలో ఇసుక ర్యాంప్‌ల పరిశీలన


నర్సింహులపేట మండలం ఆకేరువాగులో ఇసుక ర్యాంప్‌లను పరిశీలించేందుకు వెళ్తున్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ హెచ్చరించారు. జిల్లాలోని నర్సింహులపేట మండలం కొమ్ములవంచ, కౌసల్యదేవిపల్లి, ముంగిమడుగు, రామన్నగూడెం, చిన్నగూడూరు, నెల్లికుదురు మండలకేంద్రంలోని ఇసుక ర్యాంప్‌లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ఇసుకాసూరులపై కఠినంగా వ్యవహరించి, కేసులు నమోదు చేసి కట్టుదిట్టం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పరిధిలో అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణాపై పోలీసులు దాడులు నిర్వహించాలని సూచించారు. ఎవరైనా ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠినమైన సెక్షన్‌ల కింద పీడీపీపీ యాక్ట్, మైన్స్ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఇసుక అక్రమ రవాణాను నిరోధించేందుకు డయల్ 100 కాల్‌చేసి, పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. జిల్లాలో ఎవరైనా.. ఎక్కడైనా ఇసుకను అక్రమంగా తరలించిన, అధిక ధరలకు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ప్రభు త్వం కేటాయించిన ఇసుక రీచ్‌లు, స్టాక్ పాయింట్ల వద్ద భద్రత చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ అనుమతి పొందిన వారికి మాత్రమే రాష్ట్రంలో ఇసుక తరలించేందుకు, విక్రయించేందుకు అనుమతి ఉందన్నారు. తాము ఇసుక సబ్ కాంట్రాక్టర్లమని ఇతర పేర్లతో ఎటువంటి లావాదేవీలు జరిపిన అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు.

నేడు బొడ్రాయి ద్వితీయ వార్షికోత్సవం

- మానుకోటలో ఏర్పాట్లు పూర్తి చేసిన ఉత్సవ కమిటీ బాధ్యులు
- భక్తులకు ఎండవేడిమి తగలకుండా షామియానాలు
- ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎమ్మెల్యే మురళీనాయక్


బొడ్రాయి (గ్రామ) దేవత

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణంలో బుధవారం బొడ్రాయి ద్వితీయ వార్షికోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇందుకుగాను గ్రామ దేవత(బొడ్రాయి) ఉత్సవ కార్యనిర్వహక కమిటీ బాధ్యులు సర్వం సిద్ధం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా షామియానాలు ఏర్పాటు చేశారు. ఆపదలో ఉన్న ప్రజలను కాపాడే సర్వదేవతల స్వరూపం బొడ్రాయి అని ప్రజలు విశ్వసిస్తారు. జిల్లా కేంద్రంలోని పాత బజారులో అనేక ఏళ్ల క్రితం వేసిన బొడ్రాయి భూమిలో కూరుకుపోవడంతో శ్రీవేణుగోపాలస్వామి దేవాలయం సమీపాన పట్టణ ప్రజలంతా సమిష్టి నిర్ణయం తీసుకుని 5 ఫిబ్రవరి 2023న బొడ్రాయిని పునఃప్రతిష్ఠించారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా కనివిని ఎరుగని రీతిలో బొడ్రాయి పునఃప్రతిష్ఠించగా బంధువులు, ఆడబిడ్డలు తరలిరాగా సుమారు 4లక్షల మంది భక్తులు పూజలు చేశారు. ఈ నెల 12తో రెండు సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా బొడ్రాయి ద్వితీయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులు వరుసక్రమంలో వచ్చి బొడ్రాయి దేవతకు జలాభిషేకం చేసేలా ప్రత్యేకంగా క్యూలైన్‌లను ఏర్పాటు చేశారు. స్థానిక శాసనసభ్యుడు భూక్య మురళీనాయక్ ఏర్పాట్లను పర్యవేక్షించి భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఉత్సవ కమిటీ బాధ్యులకు సూచించారు. బొడ్రాయి వద్ద భక్తులు జలాభిషేకాలు చేసిన అనంతరం ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకోనున్నారు.

పూజలు ఇలా..

మహబూబాబాద్ పట్టణంలోని బొడ్రాయి వద్ద ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేయనున్నారు. శ్రీక్రోధి నామ సంవత్సర బుధవారం (నేడు) ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు జరుగుతాయి. ఉదయం 5 గంటల నుంచి బొడ్రాయి దేవతకు జలాభిషేకాలు ప్రారంభమవుతాయి. 7.15 గంటల నుంచి గోపూజ, విఘ్నేశ్వర పూజ, స్థలశుద్ధి, అంకురార్పణం, బొడ్రాయి దేవతకు జలాభిషేకం, పంచామృతాభిషేకాలు, మంటప పూజలు చేయనున్నారు. ఉదయం 10 గంటలకు హోమాలు, మధ్యాహ్నం 12.30 గంటలకు పూర్ణాహుతి, కుంభాషేకం, పంచబోనాల సమర్పణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పట్టణ ప్రజలంతా పెద్ద ఎత్తున తరలివచ్చి ద్వితీయ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని ఉత్సవ నిర్వహణ కమిటీ బాధ్యులు విజ్ఞప్తి చేశారు.

గ్రామ దేవతగా బొడ్రాయి..

ఆపదలో ఉన్న సమయంలో గ్రామ దేవతలే తమ కష్టాలను తీర్చుతారని ప్రజలు విశ్వసిస్తారు. గ్రామ దేవతలైన అమ్మవార్లకు ప్రతీకగా ఊరి మధ్యలో బొడ్రాయిని ప్రతిష్ఠించి, బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేస్తారు. ఆపై ఏటా పూజలు నిర్వహిస్తారు. ఆసమయంలో ఊరంతా కుల మతాలకతీతంగా జాతరలా జరుపుతారు. గ్రామ నడిబొడ్డున నిలువుగా నాటిన బొడ్రాయిని (బొడ్డురాయి) అని పిలుస్తారు. ఊరి పొలిమెరలను నిర్ణయించి చుట్టూ వైశాల్యానికి మధ్య భాగంలో బొడ్డురాయిని ప్రతిష్ఠించి, శాస్త్రోక్తంగా పూజలు జరిపిస్తారు. మానవ శరీరమధ్య భాగంలో నాభిలాగా గ్రామానికి మధ్యభాగంలో ఉండడంతో దాన్ని బొడ్రాయి అని పిలుస్తారు. గ్రామం మధ్యలో ప్రతిష్ఠించే బొడ్రాయి మూడు భాగాలుగా ఉంటుంది. కింది భాగాన్ని బ్రహ్మస్వరూపంగా భావించి నాలుగు పలకలుగా చెక్కుతారు. మధ్య భాగాన్ని విష్ణువుకు ప్రతీకగా ఏనిమిది పలకలతో, పై భాగాన్ని శివుడి స్వరూపంగా భావించి లింగకారంగా చెక్కుతారు. ఊరి మధ్యలో గద్దెను నిర్మించి దానిపై బొడ్రాయిని ప్రతిష్ఠిస్తారు.


మానుకోటలోని బొడ్రాయి వద్ద వార్షిక ఉత్సవాల అంకురార్పణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

ఎస్సారెస్పీ కాలువల ద్వారా నీరందించాలి



ఎంపీతో కలిసి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ప్రభుత్వ విప్ రాంచందర్‌నాయక్

కురవి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఎస్సారెస్పీ డీబీఎం-60, 40 కాలువల ద్వారా మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గంలోని రైతాంగానికి సాగునీరు అందించాలని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోత్ రాంచందర్‌నాయక్ వినతిపత్రం అందించారు. దీంతో పాటు నియోజకవర్గంలో నిర్మించతలపెట్టిన పలు మినీ ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ పాల్గొన్నారు.

సహజీవనం చేస్తున్న
జంట ఆత్మహత్య

- భర్తను వదిలి ప్రియుడితో వెళ్లపోయిన మహిళ
- వివాహేతర సంబంధంపై పంచాయితీ పెట్టిన భర్త
- పరిహారంగా రూ.3 లక్షలు డిమాండ్
- చెల్లించలేని స్థితిలో ఆ ఇద్దరి బలవన్మరణం



స్వామి, అశ్విని మృతదేహాలు

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం రెండు కుటుంబాల్లో చిచ్చుపెట్టింది. విచక్షణ మరిచిన ఓ మహిళ.. కట్టుకున్న భర్తను కాదని పరాయి వ్యక్తికి శారీరకంగా దగ్గరైంది. అతనే సర్వస్వం అనుకుంది. ఇక తనను కాదనుకున్న భార్యను వదిలించుకునేందుకు ఆమె భర్త పంచాయితీ పెట్టించాడు. రూ.3 లక్షలు డిమాండ్ చేశాడు. ఈ డబ్బులు చెల్లించలేని పరిస్థితిలో.. సహజీవనం చేస్తున్న ఆ జంట పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం గ్రామంలో మంగళవారం జరిగింది.

తుపాకులగూడెం గ్రామానికి చెందిన అలం అశ్విని (23)కి అదే గ్రామానికి చెందిన అలం కిరణ్‌తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వారికి సంతానం లేదు. ఈ క్రమంలోనే అదే గ్రామానికి చెందిన కిరణ్ సమీప బంధువు, వరుసకు మరిదయ్యే అవివాహితుడైన అలం స్వామి(25)కి మధ్య కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగుతోంది. ఈ క్రమంలోనే వారం క్రితం అశ్విని తన భర్త కిరణ్‌ను వదిలేసి.. స్వామితో కలిసి బయటకు వెళ్లిపోయింది. ఆ విషయం తెలియడంతో ఆమె భర్త కిరణ్ పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టాడు. తనను కాదనుకుని వెళ్లిపోయిన అశ్విని తనకు కూడా అవసరం లేదని.. కానీ తనకు పరిహారంగా రూ.3లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశాడు. దాంతో కిరణ్‌కు రూ.3లక్షలు స్వామి చెల్లించాల్సి ఉంటుందని పెద్దమనుషులు తీర్మానించారు. ఆ తర్వాత అశ్విని స్వామితోనే కలిసి అతడి ఇంట్లోనే సహజీవనం చేస్తోంది. అయితే కిరణ్‌కు పరిహారంగా ఇస్తామని అంగీకరించిన రూ.3 లక్షలు చెల్లించాలని పెద్దమనుషులు వారిపై ఒత్తిడి తెచ్చారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన స్వామి, అశ్విని మంగళవారం ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగారు. గమనించిన చుట్టుపక్కల వారు 108అంబులెన్స్ ద్వారా ఏటూరునాగారం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడు స్వామి తల్లి అనసూయ ఫిర్యాదు మేరకు కన్నాయిగూడెం పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మధ్యప్రదేశ్ రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మహా కుంభమేళాకు వెళ్లి వస్తుండగా ప్రమాదం
- రామరాయిని బంగ్లాలో విషాదం
- స్వగ్రామంలో నేడు బాలరాజు అంత్యక్రియలు



కల్యాణి బాలరాజు (ఫైల్)

రఘునాథపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లో ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాలో పాల్గొని తిరుగు ప్రయాణంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని రామరాయిని బంగ్లాకు చెందిన కల్యాణి బాలరాజు(30) అక్కడికక్కడే మృతి చెందాడు. దాంతో బాలరాజు స్వగ్రామం రామరాయిని బంగ్లాలో విషాదం అలుముకుంది. స్థానికుల కథనం ప్రకారం.. బాలరాజు మినీ బస్సు ఓనర్ కం డ్రైవర్‌గా పనిచేస్తూ, హైదరాబాద్‌లోనే నివాసముంటున్నాడు. భార్య మహేశ్వరి, ఇద్దరు కుమారులు చంద్రనీల, యశ్వంత్ ఉన్నారు. కాగా, హైదరాబాద్‌లోని నాచారం కార్తికేయ నగర్‌కు చెందిన ఎనిమిది మందిని తన మినీ బస్సులో ప్రయాగ్‌రాజ్ యాత్రకు వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని జబల్పూర్ జిల్లా సిహోరా పోలీస్ స్టేషన్ పరిధిలోని మొహ్లా గ్రామం-బార్గి మధ్య కాల్వ వద్ద మినీ బస్సును ఎదురుగా రాంగ్ రూట్‌లో వచ్చిన లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మినీ బస్సులో ఉన్న తొమ్మిది మందిలో ఏడుగురు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుల్లో బాలరాజు ఉండడంతో రామరాయనిబంగ్లాలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బుధవారం అంత్యక్రియలు చేయనున్నట్లు బంధువులు తెలిపారు. బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లి ఇలా మృత్యువాత పడడంతో కన్నీటి పర్యంతమయ్యారు.

ఇసుక క్వారీల్లో ఆకస్మిక తనిఖీలు

- మూడు బృందాలుగా ఏర్పడిన అధికారులు
- తొమ్మిది క్వారీల్లో ఏక కాలంలో సోదాలు
- ఇసుక నిల్వ, డంపు యార్డుల పరిశీలన



పుసుకుపల్లి ఇసుక క్వారీలో తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, సీఐ రాంచందర్‌రావు

మహదేవపూర్/మహదేవపూర్ రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల పరిధిలోని ఇసుక క్వారీల్లో అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇసుక అక్రమ రవాణాను నియంత్రించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నత స్థాయి అధికారులతో సోమవారం సమావేశమై దిశా నిర్దేశం చేసిన నేపథ్యంలో ఈ తనిఖీలు ముమ్మరంగా సాగాయి. అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి ఏక కాలంలో తొమ్మిది క్వారీల్లో సోదాలు చేశారు. అడిషనల్ కలెక్టర్ అశోక్ కుమార్, మహదేవపూర్ సీఐ రాంచందర్‌రావు ఒక బృందంగా, సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి మరో బృందం, భూపాలపల్లి ఆర్డీవో రవి, డీఎస్పీ సంపత్‌రావు ఇంకో బృందంగా ఏర్పడి ఏకకాలంలో తనిఖీలు చేశారు. క్వారీల్లో నిల్వ ఉన్న ఇసుకను పరిశీలించారు. తరలించిన ఇసుక, డంప్ చేయాల్సిన ఇసుక వివరాలపై ఆరా తీశారు. క్వారీ కాంట్రాక్టర్లతో పాటు టీజీఎండీసీ ఇన్‌చార్జులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఇసుక ఓవర్‌లోడ్, జీరో రవాణా సాగిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. మండల పరిధిలో లోడింగ్ అయిన ప్రతి లారీని వేబ్రిడ్జి ఎక్కించి పరిమితికి మించి ఇసుక ఉంటే అనుమతించొద్దని సూచించారు. దీంతో పాటు లారీలు ఇసుక రవాణా చేసే మార్గాల్లో అక్రమ రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసే ప్రదేశాలను పరిశీలించారు. ఇకపై ఓవర్‌లోడ్, జీరో రవాణా సాగిస్తూ పట్టుబడితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

వేసవిలో కరెంట్ సరఫరాకు
ప్రత్యేక చర్యలు

విద్యుత్ చీఫ్ ఇంజనీర్ రాజు చౌహాన్



విద్యుత్ పనులను పరిశీలిస్తున్న చీఫ్ ఇంజనీర్ రాజు

తొర్రూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో విద్యుత్ సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎన్‌పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ రాజుచౌహాన్ తెలిపారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మునిసిపాలిటీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. రూ.95 లక్షలతో 5 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు, 6 అదనపు విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌లను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. వీటితో పాటు మండలంలోని అమ్మాపురం, గుర్తూరు, సోమారం గ్రామాల్లో మరో 3 ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేస్తూ వ్యవసాయానికి 11 కేవీ లైన్‌లలో ఓల్టేజీ సమస్య తలెత్తకుండా లైన్ కెపాసిటర్ బ్యాంక్‌లు, 33 ఇంటర్‌లింకింగ్ లైన్‌ల ఏర్పాటు, లైన్‌లలో సమస్యలు తలెత్తుతే విద్యుత్ అంతరాయం కలిగినపుడు మరో సబ్‌స్టేషన్ 11 కేవీ లైన్ నుంచి విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మునిసిపాలిటీ పరిధిలో పనులు వివిధ దశల్లో ఉన్నాయని, మరో వారం రోజుల్లో పనులు పూర్తవుతాయన్నారు. మునిసిపాలిటీ పరిధిలో దుబ్బతండా వద్ద మరో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని, ఉన్నతాధికారుల ఆదేశాలతో స్థల సేకరణ పూర్తయిన తర్వాత ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ జి.మధుసూదన్, ఏడీఈ చలపతి, సబ్ ఇంజనీర్ సుధాకర్, ఏఈ వంశీ, లైన్‌మెన్‌లు, అధికారులు ఉన్నారు.

ఫోన్‌కాల్ ద్వారా
రూ.91,600 మాయం

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఒక్క ఫోన్‌కాల్ ద్వారా ఇద్దరి నుంచి వేర్వేరుగా రూ.91,600 సైబర్ నేరగాళ్లు మాయం చేసినట్లు మహబూబాబాద్ రూరల్ ఎస్సై దీపికారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ మండలం జంగిలిగొండ గ్రామానికి చెందిన కొమ్మరాజుల భరత్‌కు నీకు పర్సనల్ లోన్ రూ.2 లక్షల ఇప్పిస్తామని చెప్పి జనవరి 27న ఫోన్‌కాల్ వచ్చింది. అందుకు ముందుగా కొంత అమౌంట్ ఖర్చు అవుతుందని చెప్పడంతో భరత్ ఫోన్‌పే ద్వారా రూ.29600 పే చేసినట్లు చెప్పారు. అలాగే ఇదే మండలంలోని బ్రహ్మణపల్లి లక్ష్మీపురానికి చెందిన చాంద్‌బీకి ఇటీవల ఓ అపరిచిత వ్యక్తి ఫోన్‌చేసి ఎయిర్‌పోర్టులో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికి, ముందుగా రూ.33 వేలు చెల్లించాలని చెప్పారు. ఆ తర్వాత మరో రూ.29 వేలు చెల్లిస్తే ఉద్యోగం వస్తుందని చెప్పడంతో చాంద్‌బీ ఆ అమౌంట్‌ను ఫోన్‌పే ద్వారా పే చేసినట్లు చెప్పారు. అనంతరం ఆ ఇరువురు తమకు ఫోన్‌కాల్ వచ్చిన నెంబర్లకు ఫోన్ చేయగా, అవి కలవకపోవడంతో ఇరువురు మహబూబాబాద్ రూరల్ పోలీసులను ఆశ్రయించినట్లు చెప్పారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిశ్చితార్థం అయ్యాక
పెళ్లికి నిరాకరణ

రఘునాథపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నిశ్చితార్థం అయ్యాక, యువతిపై నిందలు మోపుతూ పెళ్లికి నిరాకరించిన యువకుడిని అరెస్టు చేసినట్లు ఏసీపీ భీమ్ శర్మ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతితో హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం నరహరి తండాకు చెందిన లవుడ్యా విజయ్‌కుమార్‌కు ఇటీవల నిశ్చితార్థం జరిగింది. వరకట్నం కింద రూ.లక్ష, ఇంటి నిర్మాణం కోసం రెండు లక్షలు తీసుకున్నాడన్నారు. అనంతరం అమ్మాయిని శారీరకంగా వాడుకుని, ఇప్పుడు యువతికి వేరొకరితో వివాహేతర సంబంధం ఉందని నింద మోపి పెళ్లికి నిరాకరించాడని వెల్లడించారు. దాంతో బాధితుల ఫిర్యాదు మేరకు విజయ్‌కుమార్‌పై చీటింగ్, పోక్సో కేసు నమోదు మంగళవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

గిరిజన యూనివర్సిటీకి నిధులు కేటాయించాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్



ఎస్ఎఫ్ఐ మహాసభలో మాట్లాడుతున్న కిరణ్

ఏటూరునాగారం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గిరిజన యూనివర్సిటీ నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ డిమాండ్ చేశారు. ములుగు జిల్లా ఏటూరునాగారంలోని బీఆర్ పంక్షన్ హాల్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా మూడో మహాసభలు మంగళవారం జరిగాయి. ముఖ్య అతిథిగా కిరణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం నూతన విద్యా విధానం పేరుతో విద్యారంగాన్ని కార్పొరేటీకరణ చేస్తోందని ఆరోపించారు. విద్యారంగంలో మూఢనమ్మకాలను చొప్పిస్తోందని మండిపడ్డారు. ములుగు జిల్లాకు కేటాయించిన గిరిజన యూనివర్సిటీకి ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా భవనాలు ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాశాఖకు మంత్రిని నియమించకపోవడం విడ్డూరమన్నారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటినా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్లు ఇవ్వడంలేదని, మెస్, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయడం లేదని విమర్శించారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు రత్నం రాజేందర్, కొప్పుల రఘుపతి, రత్నం ప్రవీణ్, బోడ నరసింగం, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ. దావూద్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సదుల రాకేశ్, తోకల రవితేజ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. పేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2251	2100
పల్లికాయ (సూళి)	6800	4600
పల్లికాయ (పచ్చిది)	4200	3100
కందులు	6973	5540
పెసళ్లు	7209	5645
పత్తి	7060	5800
కొత్త పత్తి	-	-
పసుపు (కాడి)	7007	6425
పసుపు (గోల)	4629	4303
తేజ మిర్చి	13200	9000
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	14200	11500
యూఎస్341ఏసీ	13350	11500
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

వడ్డెర కాలనీలో దెయ్యం ?

- ఇళ్లపై రాళ్లు పడుతున్నాయని భయాందోళన
- మూడు ఇళ్లకు తాళం



మీడియాతో మాట్లాడుతున్న సమ్మక్క

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు వడ్డెరకాలనీలో దెయ్యం భయంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఎక్కడ్నుంచో ఇండ్లపై రాళ్లు పడుతున్నాయని, ఇవి దెయ్యం చేసే పనులేనని సదరు కాలనీలో మూడు ఇండ్లకు తాళం వేసి మరో చోటకు వెళ్లిపోయిన ఉదంతం మంగళవారం చోటు చేసుకుంది. కాలనీవాసులు సమ్మక్క, బిక్షం, శ్రీను తెలిపిన వివరాల ప్రకారం. గత 40 రోజులుగా రాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజామున 3 గంటల వరకు ఇండ్లపై రాళ్లు పడుతున్నాయని చెబుతున్నారు. తెల్లవారుజామున లేచిచూసే సరికి కాలనీలోని ఆయా ఇండ్ల వద్ద పసుపు, కుంకుమ, నిమ్మకాయలు, గుమ్మడి, కొబ్బరికాయలు దర్శనమిస్తున్నాయని చెబుతున్నారు. దీంతో కాలనీకి చెందిన రాపోలు దర్గయ్య, మల్లేష్, అలకుంట్ల రాములు తమ ఇండ్లకు తాళం వేసి మరో చోటికి కుటుంబంతో సహా వెళ్లిపోయినట్లు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ వడ్డెర కాలనీకి చేరుకుని కాలనీవాసులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. దెయ్యం, భూతాలు, క్షుద్రపూజ లాంటి వదంతులను నమ్మవద్దన్నారు.



వడ్డెర కాలనీలో తాళం వేసి ఉన్న ఓ ఇల్లు

సింగరేణిలో ఎమ్మెల్సీ కోడ్ అడ్డంకి

నిలిచిన పదోన్నతులు, కౌన్సెలింగ్

కాకతీయఖని, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో సింగరేణి ఉద్యోగుల ప్రమోషన్లు, కౌన్సెలింగ్ ఆగిపోయాయి. భూపాలపల్లి ఏరియాలో ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో ఫ్యాన్, మున్షీ, సాంప్లింగ్ మజ్దూర్, సర్వే మజ్దూర్ పోస్టుల అంతర్గత నియామకాలు నిలిచిపోయాయి. సీనియర్ మైనింగ్ సర్దార్ల వెబ్ కౌన్సెలింగ్ వాయిదా పడింది. జేఎంఈటీలకు పోస్టింగ్‌లు అర్ధంతరంగా ఆగిపోయాయి. ఎస్‌డీఎల్ ఆపరేటర్ల నియామకం కుంటుపడింది. కోడ్ నేపథ్యంలో పలువురు ఉద్యోగులకు ప్రమోషన్లు నిలిచిపోయింది. మెడికల్ బోర్డు నిర్వహించి కారుణ్య నియామకాలు చేపట్టాల్సి ఉండగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో అవి కాస్త ఆగిపోయాయి. దీంతో ఏరియాలోని సుమారు 500 మంది సింగరేణి ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అయితే ఎమ్మెల్సీ కోడ్‌తో సింగరేణిలో జరగాల్సిన కార్యక్రమాలను నిలిపివేయడం సరికాదని పలు కార్మిక సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనుండగా ఈ నియామకాలు, ప్రమోషన్లు, కౌన్సెలింగ్ మరింత ఆలస్యమవుతాయని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విధులకు హాజరు కాకుంటే చర్యలు

ములుగు డీఎంహెచ్‌వో గోపాలరావు



ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో గోపాలరావు

ఏటూరునాగారం/వెంకటాపూర్ ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలోని ఏటూరునాగారం, వెంకటాపూర్ మండలాల్లో డీఎంహెచ్‌వో గోపాలరావు మంగళవారం పర్యటించారు. ఏటూరు నాగారం సామాజిక ఆస్పత్రిని ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతి కుమార్, డాక్టర్ చంద్రకాంత్, ఐటీడీఏ ప్రోగ్రాం మేనేజర్ మహేందర్‌తో కలిసి పరిశీలించారు. సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్ కుమార్‌తో సమావేశమయ్యారు. తెలంగాణ డయాగ్నొస్టిక్ కేంద్రాన్ని సత్వరంగా అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. అనంతరం ఆస్పత్రిలోని రికార్డులను, గదుల ను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు పెంచాలని, అసంక్రమిక వ్యాధుల స్క్రీనింగ్‌ను ఈనెల చివరికల్లా పూర్తి చేయాలని అన్నారు.

అలాగే వెంకటాపూర్ మండలంలోని జవహర్‌నగర్ గ్రామం లోని అయుష్మాన్ ఆరోగ్యమందిర్ వెల్‌నెస్ సెంటర్‌ను డీఎంహెచ్‌వో తనిఖీ చేశారు. అయుష్మాన్ ఆరోగ్య మందిర్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ డాక్టర్ సంఘమిత్ర, ఏఎన్ఎం ఫాతిమా, ఆశా కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.

కొమ్ములవంచ ఆనకట్టకు మహర్దశ

- కుడి, ఎడమ కాల్వల కట్టల పరిశీలన
- మరమ్మతులకు రూ.15 కోట్లతో ప్రతిపాదనలు



అక్కిరాల సమీపంలో కాల్వను పరిశీలిస్తున్న డీఈ రాజ్‌కుమార్

నర్సింహులపేట (మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమ్ముల వంచ సమీపంలో ఆకేరువాగుపై ఏర్పాటు చేసిన ఆనకట్టకు మహర్దశ రానున్నది. కుడి, ఎడమ కాల్వల మరమ్మతులకు ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ రావడంతో డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రాంచంద్రునాయక్ ఆదేశాలతో ఇరిగేషన్ డీఈ రాజ్‌కుమార్ పర్యవేక్షణలో మంగళవారం కుడికాల్వ సమీప గ్రామాలు కొమ్ములవంచ, జయపురం, రామన్నగూడెం, ముంగిమడుగు సమీప ప్రాంతాలను పరిశీలించారు. అలాగే ఎడమ కాల్వ సమీప గ్రామాలు మదనతుర్తి, మునిగలవీడు, బొజ్జన్నపేట, కౌసల్యదేవిపల్లి గ్రామాల్లో పర్యటించి, కాల్వల స్థితిగతులను అంచనా వేశారు. అలాగే రూ.15 కోట్ల నిధుల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు డీఈ తెలిపారు. నిధులు మంజూరైతే పనులు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. రెండు కాల్వల పునర్‌నిర్మాణం పనులు పూర్తయితే 2 వేల ఎకరాలకు సాగునీరందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ సిబ్బంది వెంకన్న ఉన్నారు.

లైన్‌తండాలో ఒకరిపై హత్యాయత్నం

తలకు తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన రమేష్

ఇనుగుర్తి (మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మిట్యాతండాకు చెందిన గుగులోత్ రమేష్‌పై దాడి చేసి గాయపర్చిన అదే తండాకు చెందిన బానోత్ శంకర్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు నెల్లికుదురు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. మిట్యాతండా సమీపంలోని లైన్‌తండా వద్ద సోమవారం రాత్రి రమేష్‌పై శంకర్ దాడి చేశాడు. రమేష్ తలకు తీవ్రంగా గాయమై అక్కడే పడిపోయినట్లు ఎస్ఐ చెప్పారు. మంగళవారం తెల్లవారుజామున అటుగా వెళ్లినవారు చూసి రమేష్‌ను తొలుత మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. బాధితుడు రమేష్ బావమరిది బానోత్ ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు బానోత్ శంకర్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. దాడికి కారణాలు తదుపరి విచారణలో తెలుస్తాయని ఎస్ఐ చెప్పారు.

గుడుంబా తయారు చేస్తే చర్యలు

ఎక్సైజ్ ఇన్‌చార్జ్ సీఐ ప్రవీణ్

తొర్రూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గుడుంబా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ ఇన్‌చార్జి సీఐ ఆర్. ప్రవీణ్ మంగళవారం హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారం రోజులుగా తొర్రూరు స్టేషన్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి నల్లబెల్లం, పటిక విక్రయిస్తున్న 24 మందిపై కేసులు నమోదు చేసి 9 ద్విచక్ర వాహనాలు, 1కారు, 900 కేజీల నల్లబెల్లం, 200కేజీల పటిక, 120 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసులు నమోదైన వారిని ఆయా తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రవళి, శంకర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

మినీ సంరంభానికి సర్వం సిద్ధం

నేటి నుంచి మేడారం చిన్న జాతర

- మండెమెలుగు పండుగతో ఆరంభం
- వనదేవతల మందిరాలు, గద్దెల వద్ద పూజలు చేయనున్న వడ్డెలు
- నాలుగు రోజులపాటు తల్లుల చెంతకు రానున్న భక్తజనం



వనదేవతల ప్రాంగణంలోని మంచెకు ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు

తాడ్వాయి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మేడారంలో మినీ సంరంబానికి సర్వం సన్నద్ధమైంది. బుధవారం నుంచి 15వతేదీ వరకు నాలుగురోజుల పాటు జరిగే ఈ చిన్నజాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తొలిరోజైన బుధవారం వడ్డెలు.. సమ్మక్క సారలమ్మలకు మండెమెలిగే పండుగను నిర్వహించనున్నారు. మేడారంలో వనదేవతల గద్దెలతో పాటు సమ్మక్క మందిరం, కన్నెపల్లిలో సారలమ్మ, కొండాయిలో గోవిందరాజులు, పునుగొండ్లలో పగిడిద్దరాజు మందిరాల వద్ద పూజలు చేయనున్నారు. గ్రామ దేవతలకు పూజారులు పూజలు చేసి దుష్టశక్తులు గ్రామంలోకి రాకుండా, తల్లులకు దిష్టి తాకకుండా ఈ పూజలు చేస్తారు. ఇది ఆదివాసీలకు అనాదిగా వస్తున్న ఆచారం. ఆదేవిధంగా గద్దెల వద్ద జాగారాలు, డోలు వాయిద్యాల నృత్యాలతో నాలుగు రోజులపాటు తల్లుల చెంత సందడిగా మారనుంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో మేడారం చేరుకొని మొక్కులు చెల్లించుకుంటారు. నిలువెత్తు బంగారం (బెల్లం) పసుపు కుంకుమలను సమర్పిస్తారు. మేడారం మినీ జాతరకు సుమారు 30లక్షలకు పైగా భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తుల సౌకర్యాల్లో భాగంగా ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను నడుపుతుండగా.. రూ.5.33 కోట్లతో జిల్లా యంత్రాగం భక్తుల కోసం సౌకర్యాలను కల్పించింది. మినీ జాతర నేపథ్యంలో పోలీసు శాఖ భక్తుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర విధులు నిర్వహించనుంది.

పూజా కార్యక్రమాలు

మేడారంలో సమ్మక్క మందిరంలో సిద్ధబోయిన వంశీయులు, కన్నెపల్లిలో సారలమ్మకు కాక వంశీయులు, కొండాయిలో గోవిందరాజుకు దబ్బకట్ల వంశీయులు, పునుగొండ్లలో పెనుక వంశీయులు పగిడిద్దరాజు మందిరాల్లో వడ్డెలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ముందుగా గుడులను శుద్ధి చేస్తారు. అలికి ముగ్గులు వేస్తారు. అదేవిధంగా గ్రామ దేవతలను పూజిస్తారు. ధూపదీప నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. డోలు వాయిద్యాల మధ్య గ్రామానికి నాలుగు వైపులా దిష్టి తోరణాలను ఏర్పాటు చేస్తారు. వనదేవతల గుడుల్లో మొక్కులు చెల్లించుకుంటారు. సాయంత్రం ఇంటి ఇలవేల్పులను ఘనంగా వారి వారి మందిరాలకు చేర్చి కొలువుదీరుస్తారు. అనంతరం గద్దెలకు డోలు వాయిద్యాల మధ్య చేరుకొని రాత్రంతా జాగారం చేస్తారు.

సకల సౌకర్యాలు ఏర్పాటు

వనదేవతల మినీ జాతరకు వచ్చే భక్తులకు జిల్లా యంత్రాంగం సౌకర్యాలను కల్పించింది. తొలుత జంపన్నవాగులో పుణ్యస్నానాలకు 380 బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్‌ను ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో సమకూర్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో తాగునీటి ట్యాంకులు, 400 బీహోటీలు, శాశ్వత మరుగు దొడ్ల మరమ్మతులు, 170 చేతి పంపుల మరమ్మతులుచేపట్టారు. పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో 400 వందల మంది కార్మికులతో 12 ట్రాక్టర్ల ద్వారా పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాల ఏర్పాటు చేశారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో వనదేవతల మందిరాలను, గద్దెలను ముస్తాబు చేశారు. పూలు, మామిడి తోరణాలు, రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ఎండ తీవ్రత నేపథ్యంలో గద్దెల ప్రాంగణంలో చలువ పందిళ్ల ఏర్పాటుచేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసింది.



స్నానఘట్టాలపై బీహోటీల ఏర్పాటు



మేడారంలో సమ్మక్క గుడి



కన్నెపల్లిలో సారలమ్మ గుడి



జాతరకు ముస్తాబైన బయ్యక్కపేటలోని వనదేవతల గద్దెల ప్రాంగణం

వేడుకలకు సిద్ధమైన సమ్మక్క పుట్టిల్లు

తాడ్వాయి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): చంద వంశీయుల ఆధ్వర్యంలో మండలంలోని సమ్మక్క పుట్టినిల్లయిన బయ్యక్కపేట కూడా జాతరకు సిద్ధమైం ది. బుధవారం ప్రారంభమయ్యే ఈ సంబురాల్లో భాగంగా గ్రామంలోని పురాతన గుడిని అలికి ముగ్గులు వేస్తారు. ధూపదీప నైవేద్యాలతో సమ్మక్క తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. జాతర సజావుగా జరగాలని భక్తుల కోర్కెలు తీరాలని వేడుకుంటారు. మరునటి రోజు గురువారం సమీపంలోని దేవునిగుట్టపై కొలువైన సమ్మక్కను పూజారులు గద్దెపైకి తీసుకొచ్చి ప్రతిష్ఠిస్తారు. చంద వంశీయుల ఆధ్వర్యంలో ఈ తంతు జరుగనుంది. డోలు వాయిద్యాల నడుమ పూజా కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. చంద వంశీయులు రఘుపతిరావు, పరమయ్య, గోపాల్‌రావు, కల్యాణ్‌కుమార్, కృష్ణమూర్తి, స్వామి, వడ్డెలు సిద్ధబోయిన చలమయ్య, కృష్ణరావు, ఆలెం సమ్మయ్య ఈ పండుగను నిర్వహిస్తారు. ఈ క్రమంలో బుధవారం సమ్మక్క తల్లికి పూజాలు మొక్కులు సమర్పించుకుంటారు. అనంతరం గ్రామ దేవతలకు పూజాలు చేసి ధూపదీప నైవేద్యాలను సమర్పిస్తారు. ఆదే విధంగా గ్రామానికి నాలుగు వైపులా ద్వార స్తంభాలను ఏర్పాటు చేసి దిష్టి తోరణాలు కడతారు. రాత్రి గుడి వద్ద జాగారం చేస్తారు. గురువారం ఉదయం గద్దెల పైకి అడెరాలను చేరుస్తారు. సాయంత్రం 6గంటల తర్వాత డోలు వాయిద్యాల నడువ శివసత్తుల పూనకాలతో సమ్మక్క తల్లిని దేవరగుట్ట నుంచి తలపతుల ఆధ్వర్యంలో వడ్డెలు కుంకుమ భరిణితో గద్దెకు చేరుకుంటారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకుంటారు. శుక్రవారం మొక్కులు సమర్పించి శనివారం దేవతను వన ప్రవేశం చేయిస్తారు.

మినీ జాతరకు ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్ దివాకర

ములుగు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం మేడారంలో బుధవారం నుంచి జరిగే సమ్మక్క, సారలమ్మ మినీ జాతరకు ఏర్పాట్లు పూర్తిచేశామని ములుగు కలెక్టర్ టీఎస్.దివాకర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవతల దర్శనానికి వచ్చే భక్తులు అధికారుల సూచనలు పాటించాలని కోరారు. గత పదిహేను రోజులుగా మేడారం పరిసరాలలో పారిశుధ్య పనులు చేపట్టామని, ప్రత్యేక వైద్యశిబిరాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించడానికి బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ మహిళలు దుస్తులు మార్చుకునేందుకు గదులు ఏర్పాటు చేశామన్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, క్యూ లైన్లు, గద్దెల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టామన్నారు. ఏటూరు నాగారం మండలం కొండాయి, కన్నాయిగూడెం మండలం బలాపూర్‌లో జరుగుతున్న జాతరలకు కూడా ఏర్పాట్లు చేశామన్నారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో చిన్నబోయినపల్లి నుంచి కొండాయి వరకు, తాడ్వాయి-ఊరట్టం మీదుగా కొండాయి వరకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపిస్తున్నామన్నారు.

జేఈఈ మెయిన్స్-2025 ఫలితాలలో ఎస్సార్ ప్రభంజనం



వల్లాల నాగసిద్ధార్థ | తాడిపర్తి తేజాస్ ఉద్భవ్ రెడ్డి | ఎం.రాజ వర్షిత్‌రెడ్డి

హసన్‌పర్తి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): దేశంలోకెల్లా అత్యంత ప్రతిష్ఠాత్మకమైన జేఈఈ (మెయిన్స్)-2025 (సెషన్-1)లో మంగళవారం వెలువడిన ఫలితాలలో ఎస్సార్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు అద్భుతమైన విజయాలను సాధించి జాతీయ స్థాయిలో విజయ పతాకాన్ని మరోసారి ఎగురవేసినట్లు ఎస్సార్ విద్యాసంస్థల అధినేత ఎనగందుల వరదారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఫలితాలను వివరించారు. ఫలితాల్లో ఎస్సార్ విద్యాసంస్థలకు చెందిన వల్లాల నాగసిద్ధార్థ (ఫిజిక్స్‌లో 100 పర్సంటైల్)తో 99.97 పర్సంటైల్, తాడిపర్తి తేజాస్ ఉద్భవ్‌రెడ్డి 99.83, మారం రాజవర్షిత్‌రెడ్డి 99.81, దిడ్డి ప్రజ్వల్ కుమార్ 99.77 సాధించి ఎస్సార్ కీర్తి ప్రతిష్ఠను జాతీయ స్థాయిలో నిలబెట్టినట్లు ఆయన తెలిపారు. అంతేకాకుండా వరుసగా 99.77 పర్సంటైల్, 99.66 99.66 99.66, 99.60, 99.58, 99.58 సాధించారని తెలిపారు. ఇంకా వీరితో పాటు మరో 25 మంది విద్యార్థులు 99 పర్సంటైల్ సాధించినట్లు హర్షం వ్యక్తం చేశారు. 99 పర్సంటైల్‌కు పైగా సాధించిన విద్యార్థులలో యాద భరణిశంకర్ 99.77 చల్ల అన్విక 99.66 మేడ కార్తీక్ 99.66 జోగు అభిరామ్ 99.60, కదారి సంజయ్ 99.58 చిన్ని కమలవర్ధన్ 99.58 సాధించడంపై ఎస్సార్ విద్యాసంస్థల అధినేత ఎనగందుల వరదారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎస్సార్ విద్యా సంస్థల చైర్మన్ వరదారెడ్డి, మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డిలు అభినందించారు.

భవిష్యత్తు లో మరింత అత్యుత్తమమైన మార్కులు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. యేటా రాష్ట్ర, జాతీయస్థాయి పోటీ పరీక్షలలో అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్నట్లు వరదారెడ్డి తెలిపారు.

ఏఐసీసీ వ్యవహారాల ఇన్‌చార్జ్‌తో ఎమ్మెల్యేల భేటీ

ఎమ్మెల్సీ ఎన్నికలు, ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీసిన దీపాదాస్



దీపాదాస్ మున్షిని మర్యాదపూర్వకంగా కలిసిన ఉమ్మడి వరంగల్‌కు చెందిన ఎమ్మెల్యేలు

వరంగల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షితో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పరకాల, పాలకుర్తి, వర్ధన్నపేట, భూపాలపల్లి ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి, యశస్విని‌రెడ్డి, కేఆర్.నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, కాంగ్రెస్ నేత దొమ్మాటి సాంబయ్య ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉత్తర తెలంగాణలో జరుగుతున్న టీచర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై ఆమె ఆరా తీశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. పథకాలు అర్హులైన పేదలకు చేరేలా కృషి చేయాలని ఎమ్మెల్యేలను కోరారు. అలాగే ఎమ్మెల్యే కోటాలో సీనియర్ నేత దొమ్మాటి సాంబయ్యకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని ఆరుగురు ఎమ్మెల్యేలు విజ్ఞప్తి చేశారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ ఆదేశాల మేరకు పోటీ నుంచి తప్పుకుని, పార్టీ అభ్యర్థి గెలుపుకోసం కృషి చేశారని ఎమ్మెల్యేలు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. కాగా, ఈ విషయం అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లుతానని ఆమె వారికి హామీ ఇచ్చినట్లుగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి తెలిపారు.



ఐడియా అదిరింది.. కోతులను తరిమింది..

ఇటీవల గ్రామాల్లో కోతుల బెడద ఎక్కువైంది. గుంపులుగుంపులుగా సంచరిస్తున్న వానరాలు నివాస ప్రాంతాలతో పాటు పొలాల్లోనూ తిరుగుతూ అందినవాటిని అందినట్టే ధ్వంసం చేస్తున్నాయి. ఈ క్రమంలో మొక్కజొన్న పంటలతో పాటు పలు పండ్లు, కూరగాల తోటలను కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. ఈ క్రమంలోనే వర్ధన్నపేట మండలం రాజపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు కోతుల బారినుంచి తన మొక్కజొన్న చేనుకు చుట్టూ పరదా కట్టి మినీ మెగాఫోన్(మైక్) ఏర్పాటు చేశాడు. వాటిద్వారా కుక్కలు అరిచే శబ్దం వచ్చేలా సెట్ చేశాడు. తన చేనును కాపాడుకునేందుకు ఆయన వేసిన 'ఆ ఐడియా అదిరింది.. కోతులను తరిమింది' అని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్

బర్డ్‌ఫ్లూ.. భయం!



- పౌల్ట్రీ పరిశ్రమపై వైరస్ ప్రభావం
- ఇతర జిల్లాల్లో చనిపోతున్న బ్రాయిలర్ కోళ్లు
- ఉమ్మడి వరంగల్ జిల్లా యంత్రాంగం అప్రమత్తం

మహదేవపూర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ భయం పట్టుకుంది. పలు జిల్లాల్లోని పౌల్ట్రీ ఫారాల్లో వైరస్ కారణంగా ఊహించని రీతిలో లక్షలాది బ్రాయిలర్, లేయర్ కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. అయితే వైరస్ సోకిన కోళ్ల మాంసం తింటే మనుషులకు కూడా ముప్పు మారే అవకాశముందని సర్కారు హెచ్చరించిన నేపథ్యంలో పౌల్ట్రీపరిశ్రమపై తీవ్ర ప్రభావం పడింది. ప్రాథమికంగా మిక్స్‌డ్ వైరస్ ఆర్డీ(కొక్కెర రోగం) ప్రభావంతో కోళ్ల మృత్యువాత పడుతుండగా.. ప్రస్తుతం భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని పలు గ్రామాల్లో కొక్కెర వ్యాధి బారిన పడిన ఘటనలున్నాయి. మహారాష్ట్ర తెలంగాణ సరిహద్దు జిల్లాల్లో ఉధృతంగా వ్యాప్తి చెందుతున్న ఈ వైరస్‌ను నివారించడం, బ్రాయిలర్ ఫారాల రైతులను చైతన్యవంతం చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈనేపథ్యంలోనే ఉమ్మడిజిల్లా యంత్రాంగం కూడా అప్రమత్తమైంది. వైరస్ తీవ్రత నేపథ్యంలో పౌల్ట్రీ ఫారాల నుంచి కోళ్ల రవాణాను పరిశీలించేందుకు 24 చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి దిగుమతి అయ్యే దాణా, పౌల్ట్రీ కోళ్ల దిగుమతిని నిరోధించాలని పోలీసు శాఖను, వలస పక్షుల కదలికలను పర్యవేక్షించాలని అటవీశాఖలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పక్షులు, కోళ్లు, బాతుల ద్వారా బర్డ్ ఫ్లూ మనుషులకు సంక్రమించే ప్రమాదం ఉన్నందున పౌల్ట్రీలో పనిచేసే వ్యక్తులు, కోళ్ల పెంపకం చేపట్టేవారు అప్రమత్తంగా ఉండాలి. పౌల్ట్రీ పరిశ్రమలో పనిచేసే వ్యక్తులు మాస్కులు, గ్లౌస్ ధరించి, చేతులను కడుక్కోవాలి.

బర్డ్ ఫ్లూ లక్షణాలు కనిపిస్తే సమాచారం ఇవ్వాండి

బర్డ్ ఫ్లూ అనుమానిస్తే వ్యాధి సంక్రమించిన లేదా చనిపోయిన కోళ్లను వెంటనే వేరు చేసి మాకు సమాచారం ఇవ్వాలి. మహదేవపూర్ వెటర్నరి డాక్టర్ 9121213145, వెటర్నరి జేవీవో 9441596628లో సంప్రదించాలి. రోగం వచ్చిన కోళ్లను తినొద్దు.. ప్రస్తుతం చికెన్ తినే విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరముంది. - డాక్టర్ రాజబాబు, వెటర్నరీ డాక్టర్

మేడారం మినీజాతరపై బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్

నాటుకోళ్ల వైపు భక్తుల మొగ్గు



మేడారంలో ఏర్పాటైన నాటు కోళ్ల దుకాణం

ములుగు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మేడారం మినీ జాతరపై బర్డ్‌ఫ్లూ ప్రభావం కనిపిస్తోంది. వనదేవతలకు ఆదివాసీ సంప్రదాయ పూజలు ఎంత ముఖ్యమో మొక్కుబడిగా జంతు బలులు సమర్పించే తంతు కూడా అంతే ముఖ్యమైంది. కోడిని గద్దెల వైపు గాలిలో ఎగురవేసి ఎదురుకోళ్ల మొక్కు సమర్పిస్తారు. జాతర పరిసరాల్లో విడిదిచేసి వండుకొని బంధుమిత్రులతో విందు చేసుకుంటారు. ఈ క్రమంలో ఎక్కువశాతం మంది బ్రాయిలర్ కోళ్లను, చికెన్‌ను కొనుగోలు చేస్తుంటారు. కానీ ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో బ్రాయిలర్ కోళ్లకు బర్డ్‌ఫ్లూ వైరస్ సోకి మృత్యువాతపడుతుండటం, ప్రభుత్వం కూడా అప్రమత్తమై కొద్దిరోజులు చికెన్ తినొద్దని సూచిస్తున్న నేపథ్యంలో చిన్న జాతర భక్తులు నాటుకోళ్లవైపు మొగ్గుచూపుతున్నారు. ఈ క్రమంలో మేడారంలో పలుచోట్ల నాటుకోళ్ల దుకాణాలు కూడా ఏర్పాటయ్యాయి. అయితే ఇప్పటికే మేడారంలో వందకుపైగా బ్రాయిలర్ కోళ్ల దుకాణాలు ఉండగా.. రెండురోజుల క్రితం పశుసంవర్థక శాఖ జిల్లా అధికారి కొమురయ్య ఆధ్వర్యంలో సిబ్బంది కోళ్ల రక్తం, మల నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపారు. చుట్టుపక్కల గ్రామాలలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ లక్షణాలు వెలుగు చూశాయని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చికెన్, మటన్ వ్యాపారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఆకస్మికంగా ఖరారు.. ఆ వెంటనే రద్దు..

5వ పేజీ తరువాయి



రాహుల్ వస్తారనే సమాచారంతో ఆర్ట్స్ కళాశాల మైదానంలో హెలిపాడ్ వద్ద అధికారులు, పోలీసులు

సమావేశాలు నిర్వహించేందుకు అవకాశం లేదు. ఈ క్రమంలో రాహుల్ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణనతో పాటు ఎస్సీ వర్గీకరణపై సంబంధిత వర్గాలతో మాట్లాడుతారని పార్టీ వర్గాలకు సమాచారం అందింది. దానికి అనుగుణంగా వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణికి చెందిన సుప్రభ హోటల్‌లో కావాల్సిన ఏర్పాట్లు కూడా చేశారు. సుమారు 75నిమిషాలు ఆయా వర్గాలతో మాట్లాడిన తరువాత, ఉత్తర తెలంగాణలో జరుగుతున్న మూడు ఎమ్మెల్సీ ఎన్నికలపైన పార్టీ నేతలతో కొద్దిసేపు మాట్లాడే అవకాశం ఉంటుందని పార్టీవర్గాలు భావించాయి. ఆ తర్వాత రాహుల్‌గాంధీ రాత్రి 7.15గంటలకు హోటల్ నుంచి బయలుదేరి వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి రాత్రి 7.50గంటలకు తమిళనాడు ఎక్స్‌ప్రెస్ (12622) కోచ్ ఏ1లో చెన్నైకి వెళ్లాల్సి ఉంది. ఈ రైలు జర్నీలో వరంగల్, ఖమ్మం, విజయవాడ మధ్యలో ప్రయాణికులతో రైళ్లలో భద్రత, అందుతున్న ప్రైవేట్ సేవలపై రాహుల్‌గాంధీ చర్చిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. కానీ అనూహ్యంగా రాహుల్‌గాంధీ పర్యటన రద్దు కావటం కాంగ్రెస్ వర్గాలను విస్మయానికి గురి చేశాయి.

కాంగ్రెస్ శ్రేణుల డీలా...

తమ నేత రాహుల్‌గాంధీ పర్యటన ఖరారైందని తెలిసిన వెంటనే కాంగ్రెస్ నేతలు విస్తృత ఏర్పాట్లు చేశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు ప్రకటించిన వరంగల్ ఆర్ట్స్ కాలేజీ మైదానంలోనే రాహుల్‌గాంధీ హెలికాప్టర్ దిగుతారని తెలియడంతో అక్కడే భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి స్వాగతం పలికేందుకు సన్నాహాలు చేశారు. బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణపై రాహుల్‌గాంధీతో మాట్లాడేందుకు ఎమ్మెల్యేలతో పాటు కొంతమంది విద్యావంతులను కూడా ఎంపిక చేసే పనిలో నిమగ్నమయ్యారు. వరంగల్‌లో విస్తృతంగా ఏర్పాట్లు జరుగుతున్న క్రమంలోనే రాహుల్‌గాంధీ పర్యటన రద్దయిందంటూ ప్రకటన రావడంతో కాంగ్రెస్ శ్రేణులు అయోమయానికి గురయ్యాయి. ఉదయం 10.30గంటలకే పర్యటన ఖరారై.. మధ్యాహ్నం 1.30గంటలకే రద్దయినట్టుగా సమాచారం రావడంతో వారంతా డీలా పడ్డారు. మూడు గంటల్లోనే ఏం జరిగిందో తెలియక కాంగ్రెస్ కేడర్‌లో అయోమయానికి గురైంది. తన సమీప బంధువు పెళ్లి వేడుకలకు వెళ్లిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, హనుమకొండ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి ఆగమేఘాల మీద వరంగల్‌కు తిరిగొచ్చారు. తన అనుచరులతో ఏర్పాట్లు చేయించారు. కానీ రాహుల్ పర్యటన రద్దవడంతో నాయినితో పాటు ఆయన అనుచరులు కూడా డీలా పడ్డారు. అలాగే మరికొందరు ఎమ్మెల్యేలు కూడా హైదరాబాద్ నుంచి వరంగల్‌కు చేరుకునే లోపే పర్యటన రద్దయింది.

పర్యటన రద్దుపై కేడర్‌లో చర్చ

రాహుల్‌గాంధీ పర్యటన రద్దుపై అనేక కారణాలు వినిపిస్తున్నాయి. పార్లమెంట్‌లో బుధవారం కీలకమైన అంశాలపై చర్చ ఉండటంతో రాహుల్‌గాంధీ అకస్మాత్తుగా తన వరంగల్ పర్యటనను రద్దు చేసుకున్నట్టుగా కాంగ్రెస్ నేతలు చెబుతు న్నారు. అలాగే ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్ జరిగి 31మంది మావోయిస్టులు మరణిం చిన ఘటన నేపథ్యంలో తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌లో రాహుల్‌గాంధీ రాత్రి జర్నీకి భద్రత వర్గాలు అంగీకరించలేదని, ఆ కారణంగానే రాహుల్ పర్యటన రద్దయిందనే ప్రచారం జరుగుతోంది. ఇక కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాల మూలంగానే ఆయన తన పర్యటనను అకస్మాత్తుగా రద్దు చేసుకున్నారనే ప్రచారం కూడా ఉంది. కాగా, రాహుల్‌గాంధీ వరంగల్ పర్యటన నేపథ్యంలో ఆర్ట్స్‌కాలేజీ మైదానంలో పోలీసు బలగాను భారీగా మోహరించారు. లోక్‌సభలో ప్రధానప్రతిపక్ష నేత హోదా ఉండటంతో రాహుల్‌గాంధీ భద్రతపై కేంద్ర బలగాలు దృష్టి పెట్టాయి. ఆర్ట్స్ కాలేజీ మైదానాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని విస్తృతంగా తనిఖీలు నిర్వహించాయి. సుప్రభా హోటల్‌తో పాటు వరంగల్ రైల్వే స్టేషన్‌లోనూ విస్తృతంగా తనిఖీలు చేశారు. రాహుల్ పర్యటన రద్దు కావడంతో సాయంత్రం 6 గంటలకు కేంద్ర బలగాలు వెనుతిరిగాయి. మొత్తానికి అకస్మాత్తుగా ఖరారై.. అంతేనే రాహుల్ పర్యటన రద్దు కావటం ఓరుగల్లులో చర్చనీయాంశంగా మారింది.

'స్థానిక' ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం

● డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్


బీఆర్ఎస్ సమావేశంలో మాట్లాడుతున్న రెడ్యానాయక్

సీరోలు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో డోర్నకల్ నియోజకవర్గంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అత్యధిక స్థానాలు గెలుచుకుంటుందని డోర్నకల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ ధీమా వ్యక్తం చేశారు. సీరోలు మండల కేంద్రంలో మంగళవారం బీఆర్ఎస్ మండలస్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే వ్యతిరేకత వచ్చిందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఆరుగురు సభ్యులు కొండపల్లి శ్రీదేవి, పెద్ది వెంకన్న, తేజావత్ బోజ్యానాయక, విజయ్‌పాల్‌రెడ్డి, ఆంగోతు మోహన్, మామిండ్ల వెంకన్నలతో కూడిన మండల అడ్‌హాక్ కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, తోట లాలయ్య, మక్క గోపన్న, కొండపల్లి సీతారాంరెడ్డి, నాయిని అనిల్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వర్తింపజేయాలి

- స్థానిక ఎన్నికల్లో జనాభా ప్రకారం రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి
- బీసీ సంఘాల ఐక్య వేదిక నేత డోలి సత్యనారాయణ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డోలి సత్యనారాయణ

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు బేషరతుగా 42శాతం రిజర్వేషన్ వర్తింప జేయాలని బీసీ సంఘాల ఐక్యవేదిక నేత డోలి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వేలో 51 శాతం బీసీలున్నట్లు తేలితే, ఇప్పుడు అంత కన్న తక్కువగా చూపిస్తున్నారని పదేళ్లలో జనాభా తగ్గుతుందా? పెరిగిందా? చెప్పాలనిప్రశ్నించారు. కులగణనను మళ్లీ నిర్వహించి బీసీ జనా బా ఎంత ఉందో జనాభా ప్రాతిపదికన స్థానిక ఎన్నికల్లో రాజకీయ రిజర్వేషన్ కల్పించాలన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు దక్కాల్సిన రిజర్వేషన్ దక్కితేనే బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. గతంలో ఇచ్చిన రిజర్వేషన్ ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర సర్కార్ చెబుతుందని అలాంటప్పుడు ఆర్భాటంగా కులగణన ఎందుకు చేశారో చెప్పాలన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేలో బీసీలు 51 శాతం..

బీసీల జనాభా ఆధారంగా రాజకీయ ప్రాధాన్యంకల్పించాలని డోలి సత్యనారాయణ అన్నారు. బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని బీసీ మండల్ కమిషన్ చెప్పిందని, 1989-90 మధ్యకాలంలో బీసీ రిజర్వేషన్ కోసం ఉవ్వెత్తున ఉద్యమాలు నడిచాయని పేర్కొన్నారు. 2014లో తెలం గాణ రాష్ట్రం సిద్ధించాక నాటి ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే చేసిందని అందులో 51 శాతం ఉన్నట్లు తేల్చారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో చేసిన కులగణనలో అంత కంటే తక్కువ శాతం బీసీలున్నట్లు లెక్కలు చెబుతున్నారని పేర్కొన్నారు. బీసీ జనాబా ఎంతో అంత రిజర్వేషన్ దక్కాలన్నారు. తమిళనాడుతరహాలో 69 శాతం రిజర్వేషన్ కల్పించే దిశగా రాష్ట్ర సర్కార్ చట్ట బద్ధత కల్పించాలన్నారు. ఈనెల 16న బీసీ కుల సంఘాలన్నింటితో రౌండ్ టెబుల్ సమావేశాన్ని నిర్వహించి, భవిష్యత్ పోరాట కార్యాచరణను రూపొందిస్తామన్నారు. బీసీ సంఘాల నాయకులు బొడ్డుపల్లి ఉపేంద్రం, బందారు వెంకటరమణ, షైన నాగయ్య, ఎమ్మీ. ఫరీద్, దుగ్గి గోపాల్, డోలి లింగుబాబు, అనుమాల వెంకటేశ్వర్లు, కమాలకర్, వైకృష్ణప్రసాద్, రాజేశ్వర్, నాజర్, విక్రమ్‌గౌడ్ పాల్గొన్నారు.

మేడారం మినీ జాతరకు ప్రత్యేక బస్సు

● మానుకోట డీఎం శివప్రసాద్

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క, సారలమ్మ మినీజాతరను పురస్కరించుకుని మహబూబాబాద్ నుంచి మేడారం జాతరకు ప్రత్యేక బస్సును నడుపుతున్నట్లు స్థానిక ఆర్టీసీ డిపోమేనేజర్ ఎం.శివప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ నుంచి ఉదయం 8 గంటలకు బయలు దేరి మధ్యాహ్నం 12 గంటలకు మేడారంకు చేరుకుంటుందని, తిరిగి సాయంత్రం 5 గంటలకు అక్కడ నుంచి బయలు దేరి రాత్రి 9గంటల వరకు మానుకోటకు చేరుకుంటుందని చెప్పారు. భక్తులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలి

నెహ్రూసెంటర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలలో ఎయిడ్స్ స్ర్కీనింగ్ పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని డీఎంఅండ్‌హెచ్‌వో మురళీధర్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో ఎంఎల్‌హెచ్‌పీలు తప్పనిసరిగా ఎయిడ్స్ నిర్ధారణ పరీక్షలు తప్పనిసరిగా చేయాలని, నిర్ధారణ అయిన బాధితులను సంపూర్ణ సురక్ష కేంద్రాలకు పంపించి మందులు అందేలా చూడాలన్నారు. ఎయిడ్స్ వ్యాధిపై క్షేత్రస్థాయిలో సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ మధ్య కాలంలో జిల్లాలో హెచ్ఐవీ కేసులు పెరగడంతో ఆందోళనకు గురిచేస్తుందన్నారు. ప్రజలు ఎయిడ్స్ బారిన పడకుండ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సారంగం, శ్రావణ్, విజయ్, ప్రసాద్, జ్యోతి, సారయ్య, రామకృష్ణ, పురుషోత్తం, గీత, రమేష్, శాంత రాజు పాల్గొన్నారు.

సిబ్బంది ఎన్నికల సంఘం సూచనలు పాటించాలి

● కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్


సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సంఘం సూచనలు, నిబంధనలు పాటిస్తూ.. సిబ్బంది విధులను నిర్వహించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం రానున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 18 జడ్పీటీసీ స్థానాలకు 18 మంది రిటర్నింగ్ అధికారులు, 193 ఎంపీటీసీ స్థానాలకు 63 మంది రిటర్నింగ్ అధికారులు, 63 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, సంబంధిత ఎన్నికల విభాగం సిబ్బందికి శిక్షణ నిర్వహించినట్లు చెప్పారు. ఎలాంటి సందేహాలున్న నేరుగా లేదా ఫోన్‌లో నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి విధి నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు, ఆటంకాలు లేకుండా ప్రతీ ఉద్యోగి తమకు కేటాయించిన విధులను నిర్వహించాలని, ప్రతిదానికి సమాధానం ఎన్నికల సంఘం జారీ చేసిన ఆర్వో బుక్‌లో ఉంటుందని తెలిపారు. అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్‌టొప్పో, కె.వీరబ్రహ్మాచారి, జడ్పీసీఈవో పురుషోత్తం, డీఈవో రవీందర్‌రెడ్డి, మాస్టర్ ట్రైనర్స్ రాములు, ప్రవీణ్ పాల్గొన్నారు.

పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి


దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వేంకటేశ్వర్‌రావు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వేంకటేశ్వర్‌రావు పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ 1916 సెప్టెంబర్ 25న ఉత్తరప్రదేశ్‌లోని మధుర సమీపంలోని నగ్లచంద్రభాన్ అనే గ్రామంలో జన్మించినట్లు చెప్పారు. 1937లో మొట్టమొదటి కొంతమంది స్వయం సేవకులలో ఒకరిగా చేరి, ప్రాదేశిక సహ ప్రచారక్ స్థాయికి ఎదిగారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డిరాజు రాంచందర్‌రావు, యాప సీతయ్య, బోయినపల్లి లక్ష్మణ్‌రావు, మొనంగిమురళి, వెన్నమల్ల అజయ్, గడ్డం అశోక్, సిరికొండ సంపత్, పల్లె సందీప్, ఒర్సు పద్మావతి, బాలు, మల్లం యశ్వంత్, నరేష్, నాగరాజు, సరోజన, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

నేటి నుంచి సీతారామచంద్ర స్వామి ప్రతిష్ఠాపన మహోత్సవం


మొగిలిచర్లలోని సీతారామచంద్ర స్వామి ఆలయం

కురవి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మొగిలిచర్లలో నూతనంగా నిర్మించినశ్రీసీతారామచంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠాపనమహోత్సవాన్నిబుధవారం నుంచి నిర్వహించనున్న ట్లు ఆలయ చైర్మన్ నూకల అనిత-వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఐదు రోజుల పాటు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భక్తిశ్రద్ధలతో జరిగే ఈ కార్యక్రమాన్ని శ్రీమాన్ వెంకటనర్సింహాచార్యస్వామినిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 12న శోభయాత్ర, నూతన యాగశాలలో ప్రవేశం, 13న నిత్యహోమాదులు, జలాధివాసం,14న వాస్తుహోమం, క్షీరాధివాసం, 15న ఛాయాదివాసం, ధాన్యాధివాసం, 16న నిత్యహోమాదులు, యాగశాలలో సుదర్శన నారసింహేష్టి ఫలపుష్ప శయ్యాదివాసం, 17న శ్రీసీతారామచంద్రస్వామి వారి శాంతి కల్యాణమహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

ఐటీడీఏలకు నిధులను కేటాయించాలి

● తుడుందెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ ఆగబోయిన రవి

కొత్తగూడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఐటీడీఏలకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ ఆగబోయిన రవి డిమాండ్ చేశారు. కొత్తగూడలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం షెడ్యూల్ ఏరియా చట్టాలను అమలు చేయక పోగా ఉల్లంఘనకు పాల్పడిందని ఆరోపించారు. ఐటీడీఏలను నిర్వీర్యం చేసి ఆదివాసీలకు సంక్షేమ పథకాలు అందకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. ఐటీడీఏలకు నిధులు కేటాయించకుండా నేటి ప్రభుత్వం చోద్యం చూస్తుందన్నారు. నిధులు కేటాయించి సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ సిద్ధబోయిన సంజీవ్, జిల్లా అధ్యక్షుడు కుంజ నర్సింగరావు, ఈక విజయ్, అల్లెం జంపయ్య పాల్గొన్నారు.

16న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి

● సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కొత్తగూడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఆరుగ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తు ఈ నెల 16న హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు పిలుపునిచ్చారు. కొత్తగూడలో మంగళవారం రాష్ట్ర సదస్సు కరపత్రాలను సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఆవిష్కరించారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు మొగిలి ప్రతాపరెడ్డి, కోడి సోమయ్య, మద్దెల రామయ్య, సిద్ధబోయిన జీవన్, జిట్టబోయిన రామచంద్రు, గొగ్గల రాంబాబు, భూక్య శంకర్, గట్టి సాంబయ్య, సాంబరాజు, శ్రీను, రమేష్ పాల్గొన్నారు.

నారాయణపురంలో రెవెన్యూ అధికారుల సర్వే

కేసముద్రం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నారాయణపురం గ్రామంలో రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేసేందుకు రెండు రోజులుగా రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. ఈనెల 3న పట్టాపాస్‌పుస్తకాలు ఇవ్వాలనే డిమాండ్‌తో కేసముద్రం తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలోని వాటర్ ట్యాంకు పైకి ఎక్కి ఆ గ్రామ రైతులు కొంతమంది నిరసన వ్యక్తం చేసిన విషయం విదితమే. అదే రోజు సాయంత్రం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నాను నిర్వహించగా జిల్లా కలెక్టర్ సర్వే బృందాన్ని ప్రత్యేకంగా గ్రామానికి పంపిస్తానని రైతులకు హామీ ఇచ్చారు. ఈ క్రమంలో అధికారులు గ్రామంలో రెండు రోజులుగా సర్వేను జరుపుతున్నారు. గ్రామ సరిహద్దులు పూర్తిగా కొలత వేసి వైశాల్యం తేల్చేందుకు సర్వేను నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సర్వేయర్లు ఎం.లోర్దు, ఎం.బుచ్చయ్య, సర్వేయర్లు లక్ష్మణ్, వెంకన్న, ఉపేందర్, శివయ్య, ఆర్‌ఐ బాబు, సుధాకర్, బిక్షపతి పాల్గొన్నారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు


సీపీఎం కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, స్థానిక సమస్యల పరిష్కారం కోసం సీపీఎం శ్రేణులు క్షేత్రస్థాయిలో నిరంతరం పోరాటాలు నిర్వహించాలని జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో మంగళవారం సీపీఎం మునిసిపల్ వార్డు బాధ్యుల సమావేశాన్ని రావుల రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానుకోట పట్టణ ప్రజలు అనేక సమస్యలతో కొట్టు మిట్టాడుతున్నారని, వాటి పరిష్కారం కోసం అలుపెరగని పోరాటాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు సూర్నపు సోమయ్య, సమ్మెట రాజమౌళి, చీపిరి యాకయ్య, హేమానాయక్, బానోత్ వెంకన్న, గొని వెంకన్న, యమగాని వెంకన్న, తోట శ్రీనివాసు, నూనె శ్రీనివాసు, రేఖ దేవేందర్, మందుల మహేందర్, ఎస్కే రజాక్, విజయలక్ష్మి, ఉపేంద్ర పాల్గొన్నారు.

మార్కెట్లో 'సారథి'కళాకారుల ప్రదర్శన

కేసముద్రం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం వ్యవసాయ మార్కెట్ యార్డులో కలెక్టర్, ప్రజాసంబంధాల శాఖాధికారి ఆదేశాల మేరకు మంగళవారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ఆధ్వర్యంలో రైతులకు మాదక ద్రవ్యాలతో జరిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ కళా ప్రదర్శనలిచ్చారు. కొమిరె వెంకన్న, బండ వెంకన్న, జబర్దస్త్ రాజమౌళి, ఉప్పరి సురేష్, మిట్టగడుపుల భరత్, శారువెంకటేష్, వంగూరి శ్రీనివాస్, దేశెట్టి ప్రవీణ్‌కుమార్, పోతురాజు అశ్విని, చెడుపాక కవిత, ఈసం సింధుజ, నట్ల అంజయ్య, ఎండీ.యాకూషావళి పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి


వెల్లికట్టెలో బీఆర్ఎస్ నాయకుల విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్

తొర్రూరు రూరల్, ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతీ ఒక్కరు కృషి చేయాలని తొర్రూరు మాజీ జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశాలతో మంగళవారం మండలంలోని వెల్లికట్టె ఎంపీటీసీ పరిధిలోని బోజ్యాతండా, టీక్యాతండా, పెద్దమంగ్యాతండా గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తల సమన్వయ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ సమావేశంలో ఆయా గ్రామాల నాయకులు, మాజీ సర్పంచ్‌లు, పోసాని రాములు, జాటోతు రమేష్, కాలునాయక్, దేవేందర్ రావు, శ్రీనివాస్, యువజనసంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'ముగ్గురు సంతానం ఉన్నా.. పోటీకి అవకాశం ఇవ్వాలి'

తొర్రూరు రూరల్, ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు పిల్లలు ఉన్న తల్లిదండ్రులకు అవకాశం కల్పించాలని తొర్రూరు గిరిజన సంఘం నాయకులు హపావత్ సురేష్, జాటోతు సురేష్, యాకయ్య, రాము కోరారు. 1995 మే 30 తరువాత రాష్ట్రంలో ఇద్దరు పిల్లలకు మించి ఉన్న తల్లిదండ్రులకు పోటీచేసే అవకాశాన్ని అప్పటి ప్రభుత్వం రద్దు చేయడం జరిగిందన్నారు. ఈ నిబంధనను ప్రభుత్వం ఉపసంహరించాలని జనగామ జిల్లా కొడకండ్ల మండలంలో ఆమరణ నిరహార దీక్ష చేపట్టిన గాంధీనాయక్‌ను మంగళవారం గిరిజన సంఘాల నాయకులు మద్దతు తెలిపి శాలువాతో సత్కరించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ముగ్గురు పిల్లల నిబంధనను సడలించి అవకాశం కలిపించాలని వారు డిమాండ్ చేశారు.

ఎస్సెస్సీలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

తొర్రూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం విద్యాశాఖ ఆధ్వర్యంలో మోటివేషన్‌అండ్ గైడెన్స్ ప్రోగ్రామ్‌ను పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తోంది. మంగళవారం తొర్రూరు హైస్కూల్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎడ్యుకేషన్ డైరెక్టర్ యోగితారాణి విద్యార్థులకు వర్చ్యువల్‌గా తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బుచ్చయ్య, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, బ్రహ్మానందరెడ్డి, జ్యోతి, ఉపేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఫలితాలకు ఉపాధ్యాయులు కృషి చేయాలి

మరిపెడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : పది వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు వచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆంగ్ల బోధనపై స్టేట్ రిసోర్స్‌పర్సన్ బయ్యగాని రాంమోహన్ అన్నారు. మంగళవారం మరిపెడ హైస్కూల్‌లో ఇంగ్లీష్ బోధన టీచర్ల స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. మండల ఎల్లా కన్వీనర్ మంగు, నర్సింహులపేట, చిన్నగూడూరు, మరిపెడ మండలాలకు చెందిన ఆంగ్ల బోధన టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు 30 సైకిళ్లు పంపిణీ

నెల్లికుదురు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మునిగలవీడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మెడివెస్ట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో మంగళవారం 30 సైకిళ్లు అందజేశారు. జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నాగవాణి మాట్లాడారు. దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు పాఠశాలకు ఇబ్బంది కలుగకుండా ఉండటానికి విద్యార్థులకు సైకిళ్లు అందిండం జరిగిందన్నారు. మైండ్స్ ఎకౌంట్స్ ఆఫీసర్ మల్లయ్య, రామకృష్ణ, ఉపాధ్యాయులు రామస్వామి, సలీం, భవాణి, మురళీకృష్ణ, వెంకటేశ్వర్లు, యాకయ్య, విజయ్‌సాగర్, రంజిత్, ప్రసాద్‌రావు, పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని నయం చేయొచ్చు

మరిపెడ, ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి): క్షయ (టీబీ) వ్యాధిని మందులతో నయం చేయొచ్చునని మండల్ మెడికల్ ఆఫీసర్ రవి అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల ఆరోగ్య కార్యకర్తలు సేకరించిన క్షయ నిర్ధారణ నమూనాలను జిల్లా ఆస్పత్రికి పరీక్షల కోసం పంపించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎడతెరపి లేని దగ్గు, ఆయాసం ఉన్నట్లైయితే ఆయా గ్రామాల ఆరోగ్య కార్యకర్తలను కలిసి పరీక్షల కోసం సంప్రదించాలని సూచించారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఖర్చుల కోసం నెలకు రూ.500 ఇస్తుందని తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్లు సుదర్శన్, ఆచార్యులు, ల్యాబ్ టెక్నీషయన్ అనిత, రవి కుమార్, అసిస్టెంట్ నర్సయ్య, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మండల్ మెడికల్ ఆఫీసర్ రవి

విద్యార్థులు మనోధైర్యంతో ముందుకుసాగాలి

● ఎంఈవో మహంకాళి బుచ్చయ్య

తొర్రూరు రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించడానికి మనోధైర్యంతో ముందుకుసాగాలని ఎంఈవో మహంకాళి బుచ్చయ్య అన్నారు. మంగళవారం విద్యాశాఖ మోటి వేషనల్ అండ్ గైడెన్స్ ప్రోగ్రాం నిర్వహించారు. చెర్లపాలెం ఉన్నత పాఠశాలలో ఎడ్యూకేషనల్ సెక్రెటరీ యోగితారాణి, ఎడ్యూకేషనల్ డైరెక్టర్ ఈవీ నరసింహారెడ్డి, సైకాలజిస్టుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో బుచ్చయ్య మాట్లాడారు. విద్యార్థులు ప్రతికూల పరిస్థితులు, ఒత్తిళ్లను అధిగమించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. పది విద్యార్థులు మానసిక, మనోధైర్యంతో లక్ష్యాలను ఎంచుకొని పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయబృందం జయపాల్‌రెడ్డి, యాకూబ్‌అలీ, కరుణాకర్‌రెడ్డి, మల్లయ్య, రాధాబాయ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి


చలో ఢిల్లీ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

తొర్రూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. మంగళవారం తొర్రూరులో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు అనుసరించడంతో పేదరికం, నిరుద్యోగం, అవినీతి పెద్దఎత్తున పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 28న ఛలో ఢిల్లీని జయప్రదం చేయాలని కరపత్రాలు ఆవిష్కరించారు. వీరన్న, నవీన్, యాకయ్య, సురేష్, రాజు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం : బీఆర్ఎస్

పెద్దవంగర, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 14నెలలు కావస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన 420హామీల్లో ఏ ఒక్కటి అమలు చేయలేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. మంగళవారంబొమ్మకల్, పోచారం, గ్రామాలలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. అదే విధంగా బుధవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించనుండగా ఈ సమావేశానికి మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హాజరుకావడం జరుగుతుందని ఆయన తెలిపారు. నాయకులు గంగాధర్, వీర్న, సీత్యా, బాలునాయక్, వెంకన్న, రాంమూర్తి, యాకన్న రవి, నరేష్, సమ్మయ్య, మధు, ప్రశాంత్ పాల్గొన్నారు.

తల్లులపై ప్రేమేదీ?


చింతలగట్టు జాతర వ్యూ (ఫైల్)

(5వ పేజీ తరువాయి)

తన జాబితాలో లేకపోవడంపై భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

బెల్లమే బంగారం..

వనదేవతల పూజల కోసం భక్తులు బెల్లం ఉపయోగిస్తారు. ఈ బెలాన్నే వారు బంగారమని పిలుస్తారు. కోరిన కోరికలు తీరిస్తే నాఎత్తు బంగారాన్ని (బెల్లం) మీకు సమర్పించుకుంటానని భక్తులు సమ్మక్క, సారలమ్మకు మొక్కుకుంటారు. తమ ఎత్తు (బరువు) బంగారాన్ని తూకం వేసిన తర్వాత అందులో నుంచి కొంత మొత్తాన్ని తలమీద పెట్టుకుని దేవతల గద్దెల వద్ద ఉంచుతారు. కొంత తమతో ఇంటికి తీసుకెళ్తారు. కొందరు ఎదురు కోళ్లపేరుతో తమ మొక్కులను తీర్చుకుంటారు. కోళ్లకు దారం కట్టి దేవతాల గద్దెలకు అభిముఖంగా ఎగురవేస్తారు. సంతానం లేనివారు చిన్న ఊయలను చేసి, తల్లులకు సమర్పించుకుంటారు.